క్లుప్తంగా

7న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రిన్స్‌పాల్ దిలీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన (బుధవారం) ఆదర్శ పాఠశాలలో ఓఎంఆర్ షీట్‌తోపాటు జవాబులను ఓఎంఆర్ షీట్‌లో ఎలా గుర్తించాలో అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చేరే విద్యార్థులు 7వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట


రైతులకు విత్తనకాయలను అందిస్తున్న సర్పంచ్

గాలివీడు : రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నూలివీడు సర్పంచ్ ఉమాపతిరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు జల్లా నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నూలివీడు రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కడప అమానుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.ఈశ్వర్ రెడ్డి, ఎస్.ఆర్.బాషా, సచివాలయం, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో పూజలు


పూజలందుకున్న భ్రమరాంబిక

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని పలు చోట్ల అమ్మవారి ఆలయాలలో శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మారమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ, భ్రమరాంబికా, పట్టణంలోని భుజంగేశ్వర, అమ్మవారిశాల ఆలయాలలో మహిళలు రాహుకాల పూజలు చేసి దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నివాళి


సభలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

ఓబులవారిపల్లె : సీపీఐ సీనియర్ నాయకుడు, మంగంపేట మాజీ సర్పంచ్ చౌడవరం శంకరయ్యకు వైఎస్సార్‌సీపీ, సీపీఐ, సీపీఎం తదితర పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం మంగంపేటలో శంకరయ్య సంస్మరణ సభను నిర్వహించారు. శంకరయ్య సీపీఐ నాయకుడిగా, సర్పంచ్‌గా మంగంపేట నిర్వాసిత కుటుంబాలకు కోసం చేసి పోరాటల గురించి తెలిపారు. అనంతరం శంకరయ్య స్మారక విగ్రహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం జిల్లా రాష్ట్ర నాయకులు, సీపీఓ సుదర్శన్‌రెడ్డి, ఉప సర్పంచ్ కౌలూరి మధుసూదన్‌రెడ్డి, టీడీపీ నాయకులు బత్యాల చెంగల్‌రాయుడు, కౌలూరు నారాయణరెడ్డి, తల్లెం రమణారెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, గునిపాటి రాయుడు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఘన జీవామృతం మేలు

వాల్మీకిపురం : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న పంటలకు ఘన జీవామృతం ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ రెడ్డిబాషా అన్నారు. శుక్రవారం మండలంలోని వెలగపల్లిలో రైతు గోవిందురెడ్డి 500 కిలోల ఘన జీవామృతం తయారు చేసి, పంటకు వేశారు. ఘన జీవామృతం వలన భూమి లోపల ఎక్కువ సంఖ్యలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, తద్వారా మొక్కకు కావలసిన పోషకాలు అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుశీల, పెద్ద రెడ్డెయ్య, రైతులు పాల్గొన్నారు.

కేశాలు దానం చేసిన పూజిత

మదనపల్లె సిటీ : క్యాన్సర్ బాధితుల మోముల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక సొసైటీకాలనీకి చెందిన జి.కృష్ణమూర్తి కుమార్తె కృష్ణపూజిత హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తన కేశాలను దానం చేశారు.

రేపటి నుంచి పాలేటమ్మ తిరునాల

కలికిరి : మండలంలోని గుట్టపాళెం గ్రామం గుట్టపాళెం కస్పాలో వెలసిన గ్రామదేవత పాలేటమ్మ తిరునాల ఆదివారం నుంచి రెండు రోజుల పాటు గ్రామస్తుల ఆధ్వర్యంలో జరుగనున్నట్లు ఆలయ ధర్మకర్త బాలరెడ్డెప్పనాయునివారు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పెట్టుబడి అధికం.. గిట్టుబాటు ధర తగ్గుముఖం

- నిరాశలో మామిడి రైతాంగం
- కష్టించిన ఫలితం దక్కలేదంటూ ఆవేదన
- అధిక ఎండలకు తగ్గిన నాణ్యతా, దిగుబడి


యార్డుకు వచ్చిన మామిడికాయలు

మండలము	మామిడి పంట (ఎకరాలలో)
కోడూరు	12050
ఓబులవారిపల్లి	1975
చిట్వేలి	4697
పుల్లంపేట	1500
పెనగలూరు	8300

రైల్వేకోడూరు అర్బన్ : ఆరుగాలం కష్టపడినా మామిడి రైతులకు నిరాశే ఎదురవుతోంది. నియోజకవర్గంలోని కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాలలో ప్రతి ఏడాది 50 వేల ఎకరాలకు పైగా మామిడి పంటను పండిస్తున్నారు. ఇక్కడ పండే మామిడికాయలను కోడూరు మార్కెట్ యార్డు ద్వారా గుజరాత్, ముంబాయ్, చెన్నై, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రతి ఏటా 100 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుంది. మామిడికాయల కాపు అంతంత మాత్రంగా రావడంతో ధరలు అధికంగా ఉంటాయని రైతులు ఆశ పెట్టుకొన్నారు. ఈ ఏడాది ఎండలు ఉండడం వల్ల ఏప్రిల్, మే నెలల్లో మామిడికాయల కాపు రావడంతో రైతులు మాత్రం ఉన్న పంటను కాపాడుకోవడానికి అధికంగా పెట్టుబడులు పెట్టి మందులు పిచికారీ చేశారు. సరాసరి ఎకరాకు 50 వేలు పెట్టుబడి పెట్టారు. ఈ యేడాది మామిడి ధరలు ఉన్న ఫలంగా తగ్గడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. బేనీసా రూ.20, బెంగుళూరు 14, నీలం 15, పులిహోర 10 రూపాయలు మార్కెట్ యార్డులో ధరలు కిలోకు పలుకుతున్నాయి. యార్డుకు తరలించాక నాణ్యత సాకులతో అన్ని రకాల మామిడి కాయలపై ధరలు తగ్గుతున్నాయి. తోటలు కాపు కొన్న వారి పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. దీంతో మామిడి రైతులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ ఏడాది మామిడి సీజన్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఇప్పుడు రైతులు మామిడి తోటల్లో ఉన్న కాయలను యార్డుకు తరలిస్తున్నారు. వ్యాపారస్తులు కూడా కేవలం మామిడికాయల ఎగుమతులు ప్రారంభించారు. రోజూ 15 నుంచి 20 లారీల సాయంతో కాయలను ఎగుమతి చేస్తున్నారు.

ఆలస్యంగా కాపు..



మామిడి పంట ఆలస్యంగా రావడంతో పెట్టుబడి అధికమైంది. ఎండలు అధికంగా ఉండటంతో ఈ ఏడాది దిగుబడి తగ్గింది. ధరలు బాగా ఉంటాయని ఆశలు పెట్టుకొంటే ధరలు బాగా తగ్గాయి.

– మల్లు రఘురామిరెడ్డి, మామిడి రైతు, రాఘవరాజుపురం, రైల్వేకోడూరు

సన్నగిల్లిన ఎగుమతులు



రైతులు పండించిన మామిడి కాయలు మంచి ధరలు పలకాలంటే నాణ్యతా ప్రమాణాలు ఉండాలి. వాతావరణ మార్పులు, పురుగుకాటుల వల్ల కాయల నాణ్యత తగ్గుతున్నాయి. దీని వల్ల కొన్ని ప్రాంతాలలో ధరలు తగ్గుతున్నాయి.

– జనార్దన్, మామిడి కాయల వ్యాపారి, రైల్వేకోడూరు

సిద్దవటం రేంజర్ కడపకు బదిలీ


రేంజర్ ప్రసాద్

సిద్దవటం : సిద్దవటం రేంజర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ కడప రేంజ్‌కి బదిలీ అయ్యారు. ఈయన సిద్దవటం రేంజర్‌గా 5 సంవత్సరాలకు పైగా విధులు నిర్వహించారు. అటవీశాఖ అధికారులతో పాటు ప్రజల్లో మన్నలను పొందారు. ఎర్రచందనం పరిరక్షణకు కృషి చేశారు. అటవీ అభివృద్ధి పనులు, పర్యావరణ పరిరక్షణకు పాటుపడ్డారు. సిద్దవటం అటవీశాఖకు కొత్త రేంజర్ వచ్చేంత వరకు ప్రసాద్ ఇన్‌చార్జి రేంజర్‌గా బాధ్యతలను నిర్వహించనున్నారు.

అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థిని


వందనను అభినందిస్తున్న పీడీ రత్నకుమారి

రాయచోటి టౌన్ : జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఆర్.వందన ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల పీడీ రత్నకుమారి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి భూపాల్‌లో నిర్వహించే పోటీలలో వందన పాల్గొంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని వైస్ ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుల ఉన్నతి కోసం ప్రభుత్వం కృషి


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లె (రాయచోటి టౌన్) : రైతుల ఉన్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వీరబల్లె ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కస్తూర్బా గురుకుల పాఠశాల సమీపంలో రైతుల ఉత్పత్తుల సేకరణ కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతులు ఉన్నత స్థితిలో ఉండాలని, ఆర్థికంగా ఎదగాలనే ఆకాంక్షతో సీఎం జగన్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఉత్పత్తి చేసే పంటల సేకరణ కోసం ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.15లక్షలతో కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తున్నామని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వీరనాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్ వలి, రైతుల ఉత్పత్తిదారుల సంఘం మండల నాయకుడు సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు బాధ్యతగా పనిచేయండి


సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

చిట్వేలి : ప్రజా శ్రేయస్సు కోసం అందరూ బాధ్యతగా పనిచేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సీడీపీఓ రాజేశ్వరి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ సభా భవనంలో చిట్వేలి, పెనగలూరు మండలాలకు సంబంధించిన 144 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. కేంద్రానికి వచ్చే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించడం, గర్భిణులు, బాలింతలకు పరిశుభ్రత, పోషకాహారంపై సూచనలు ఇవ్వడంతోపాటు వారు ఆచరించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రాలకు వచ్చే సభ్యులను తమ కుటుంబ సభ్యులు వలే చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుభద్రమ్మ, విజయకుమారి, నిర్మల, సుధారామి, సుధామణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి


డ్రైనేజీని పరిశీలిస్తున్న డా.ఉమామహేశ్వరకుమార్

సిద్దవటం: ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ ఉమామహేశ్వర కుమార్ తెలిపారు. పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌లో 104 వైద్య సేవలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన సిద్దవటం దిగువపేటలోని ప్రధాన బస్టాప్ వద్ద ఉన్న మురికి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం లోని ప్రజలు వారంలో ఒక్కసారి గృహాల్లోని తొట్లు, ప్లాస్టిక్ పాత బిందెలు, తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. లేదంటే అక్కడ దోమ గుడ్లు పెట్టి అది లార్వాగా మారి దోమలుగా విపరీతంగా తయారవుతుయన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ జరాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ మురికిని తొలగించడమా, లేదా సపోర్టు వాల్ కట్టి కల్వర్టును మూయించడమా చేసేలా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పి.కొత్తపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, ఆశా వర్కర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీల జీఓను సవరించండి


కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న హెల్త్ సెక్రటరీలు

రాయచోటి అర్బన్ : గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల బదిలీ జీఓను వెంటనే సవరించాలని ఏపీ గ్రామ సచివాలయం హెల్త్ సెక్రటరీల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి, ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి సాంబశివలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బదిలీల జీఓలో హెల్త్ సెక్రటరీలకు అన్యాయం జరిగిందన్నారు. మిగిలిన ఉద్యోగులందరికి బదిలీల అంశంలో ఆన్‌లైన్‌లో 5 రకాల ఆప్షన్‌లు ఉన్నాయన్నారు. మహిళా ఉద్యోగులైన హెల్త్ సెక్రటరీలకు మాత్రం ఒకే ఒక్క మ్యూచువల్ ఆప్షన్‌ను మాత్రమే పెట్టడం దారుణమన్నారు. ఇతర ఉద్యోగులతో సమానంగా ఆప్షన్‌లు ఉంచాలన్నారు. అలాగే బదిలీల దరఖాస్తుకు ఆఖరు గడువును జూన్ 3వ తేదీన ఉండి జూలై 30వతేదీకు పొడిగించాలంటూ వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి పుల్లయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి భద్రకాళికి రాహుకాల పూజలు


దర్శనమిస్తున్న భద్రకాళి

రాయచోటి టౌన్ : భద్రకాళికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించారు. మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

మాజీ ఎమ్మెల్యేతో భేటి అయిన ఎంపీ మిథున్ రెడ్డి


మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మతో చర్చిస్తున్న మిథున్ రెడ్డి

పెనగలూరు : రాజంపేట మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ స్వగృహమైన కొండూరులో శుక్రవారం ఎంపీ మిథున్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యేతో ఎంపీ వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం. వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండూరు విజయ్ రెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదును అందిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : రెండురోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన ఆటోడ్రైవర్ ఎం.చెంగల్‌రాయుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలుసుకున్న కేఎస్‌యూఏఫ్ ఆటోయూనియన్ సభ్యులు శుక్రవారం అందరూ ఎంపీటీసీ బండారు మల్లికార్జున ఆధ్వర్యంలో రూ.20 వేలు కుటుంబ సభ్యులకు అందించారు.

పురవీధులలో ఊరేగిన వేణుగోపాలుడు


ప్రత్యేక పూజలు అందుకుంటున్న వేణుగోపాలుడు

పెనగలూరు : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చాడు. శుక్రవారం రాత్రి రెడ్డి సంఘం వారిచే హనుమంత సేవ ఘనంగా నిర్వహించారు. తిరుపతి వాస్తవ్యురాలు రాధిక మహా భారతంలోని రాజసూయ యాగం ఘట్టాన్ని వివరించింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ పంచేటి సుబ్బారెడ్డి, పురోహితుడు సుబ్బనరసయ్యలు తెలిపారు. వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ముదిరాజ్ సంఘం వారిచే గరుడ సేవ జరగనుంది.

రోడ్డుకు హద్దుల ఏర్పాటు


హద్దులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

పుల్లంపేట : మండలంలోని పుల్లంపేట నుంచి చిట్వేలికి వెళ్లే రహదారి ఆక్రమణకు గురవ్వడంతో శుక్రవారం తహసీల్దార్ నరసింహకుమార్ ఆధ్వర్యంలో సర్వేయర్ అనూష హద్దులు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. ఆర్అండ్‌బీ అధికారుల చొరవతో ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం కలిగింది. త్వరలో ఆక్రమణలు తొలగించి రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


పూర్ణాహుతి పూజలు నిర్వహించిన దృశ్యం

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల కేంద్రంలోని వంగిమళ్లలో కస్పాలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి సునందా రెడ్డి ఆధ్వర్యంలో పూర్ణాహుతి పూజలు శుక్రవారం నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం ఏర్పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం నిర్వహించే కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు విజయసాగర్‌రెడ్డి (మదన్‌రెడ్డి), మధుసూధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘనంగా నివాళి

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో ఛత్రపతి శివాజీకి ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం స్థానిక పోలేరమ్మతల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సమరసతాసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చలపతి, కిషోర్, రామాంజులు, రమణమ్మ, శ్యామల, మురళీ, భరత్ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

- 18 పంచాయతీలకు ఇద్దరు సర్పంచ్‌లు హాజరు


మాధవరం-1 సమస్యలపై అధికారిని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

సిద్దవటం : మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. మండల కేంద్రంలోని డ్వాక్రా భవనంలో శుక్రవారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరయ్యారు. 18 గ్రామ పంచాయతీలకు గాను ఇద్దరు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. మాధవరం-1 గ్రామ పంచాయతీలో ప్రజలకు నీటి సౌకర్యం అందలేదని, గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న హరిత రాయబారులకు నెలల తరబడి జీతాలు మంజూరు కాలేదని ఆప్రాంత ఎంపీటీసీ సభ్యులు శివయ్య, లక్ష్మిరెడ్డిలు సభా దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ ఫణిరాజకుమారి స్పందిస్తూ పంచాయతీలో నిధులు ఉన్నప్పటికీ మీరు ఎందుకు సిబ్బందికి జీతాలు ఇవ్వడంలేదని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్యను ప్రశ్నించగా ఆయన సిబ్బందికి బిల్లులు పెట్టాం.. టెక్నికల్ ప్రాబ్లం ఉందని సభా దృష్టికి తీసుకొచ్చారు. అలాంటి మైనర్ ప్రాబ్లంలు అన్ని గ్రామ పంచాయతీ సెక్రటరీ అయిన మీరే చూసుకోవాలని ఎంపీడీఓ తెలియజేశారు. బొగ్గిడివారిపల్లె ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీలో బోరు, పైప్‌లైన్ పనులను రెండు సంవత్సరాల కిందట పూర్తి చేశామని ఇంత వరకు బిల్లులు మంజూరు కాలేదని, పనిచేస్తే బిల్లులు వచ్చే పరిస్థితి లేదని ఇలా జరిగితే మా పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, ఎంఈఓ శంకరయ్య, ఏఓ రమేష్‌రెడ్డి, ఉపాధి ఏపీఓ శైలజ, డ్వాక్రా ఏపీఎం వెంకటేష్, పలుశాఖల ఏఈలు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన గ్రామ సచివాలయం


ప్రారంభానికి ముస్తాబైన వెలిగల్లు గ్రామ సచివాలయం

గాలివీడు : మండల పరిధిలోని వైఎస్సార్ వెలిగల్లులో గ్రామ సచివాలయం నూతన భవనం సోమవారం మధ్యాహ్నం రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. గ్రామీణులకు ప్రభుత్వ సేవలను చేరువ చేసే ప్రక్రియలో భాగంగా సచివాలయాలను ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇందులో భాగంగా వెలిగల్లు గ్రామంలో రూ.45 లక్షల నిధులతో నూతన సచివాలయాన్ని నిర్మించారు. వైఎస్సార్ కాలనీలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయాలు ఎంతో దోహదపడుతున్నాయి.

గడప గడపకు మన ప్రభుత్వం...

సోమవారం మధ్యాహ్నం నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, నాయకులు అందుబాటులో ఉండాలని తెలియజేశారు.

ధరల్లేక పొలంలోనే వదిలేసిన టమాట


టమాటను పొలంలో వదిలేసిన దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : రైతు పొలంలో ఏదో ఒక పంట సాగుచేయాలనే ఆత్రుతతో అష్టకష్టాలు పడి అప్పు సొప్పులు చేసి పంటసాగు చేస్తాడు. అయితే పొలం సాగుచేసే ముందు ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయని, అప్పులు తీరుతాయని ఆశతో పంట సాగు చేస్తే.. తీరా పంట చేతికందే సమయంలో ధరలు పడిపోవడంతో రైతులు డీలా పడుతున్నారు. మండలంలో రబీలో ప్రత్యామ్నాయ పంటలు టమాట ఇతర కూరగాయల పంటలు సాగు చేస్తారు. అయితే ఏ పంట సాగుచేసినా రైతుకు గిట్టుబాటు ధరలేక అప్పుల పాలవుతున్నారు. మండలంలోని దప్పేపల్లి పంచాయతీలోని డి రామాపురానికి చెందిన ఓబులేసు అనే రైతు ఎకరా పొలంలో టమాటను సాగు చేశాడు. పంటమాత్రం ఆశాజనకంగా ఉంది. ఒకటి, రెండు, మూడు కోతలు కోసి మార్కెట్ తరలించి తరువాత ఒకసారిగా ధరలు పడిపోవడంతో రైతుకు విసుగెక్కి కనీసం ఖర్చులు కూడా రాకపోవడంతో టమాటను పొలంలో వదిలేశాడు. పంట నష్టపరిహారంలో తమను ఆదుకోవాలని ఆ రైతు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

పాఠశాలకు ఆటస్థలం మంజూరు చేయండి


ఎంపీడీఓకు వినతి పత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

సిద్దవటం : మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరపురం ఎంపీయూపీ స్కూల్‌కు ఆటస్థలం మంజూరు చేయాలని మండల సమావేశంలో గ్రామస్తులు ఎంపీడీఓ ఫణి రాజకుమారికి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పాఠశాలకు సమీపంలో సర్వేనెంబర్ 892/2లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని పాఠశాల ఆట స్థలంగా ఉపయోగిస్తున్నప్పటికి గత నెల 25వ తేదీన కొందరు ఈ స్థలం తమదని స్థలాన్ని చదును చేసే ప్రయత్నం చేయగా అడ్డుకున్నామన్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు ఆట స్థలం కేటాయించాలని కోరారు.


గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు

వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

మండల కేంద్రంలోని కటికంవారిపల్లె గ్రామంలో శుక్రవారం వేణుగోపాలస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. పూజారులు భక్తులకు ప్రసాదలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా వాహనంపై కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. కోలాటం ప్రత్యేక అకర్షణగా నిలిచింది.

– ఓబులవారిపల్లె